సాక్షి ఖమ్మం

బుధవారం • 19 • ఫిబ్రవరి • 2025



అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట

కేఎంసీ పరిధిలో అనుమతి లేకుండా చేపడుతున్న నిర్మాణాలను అడ్డుకునేందుకు అధికారులు రంగంలోకి దిగారు. 8లో



బోర్డు ఏర్పాటుచేయాల్సిందే..

మిర్చి రైతులకు కనీస మద్దతు ధర దక్కేలా ప్రత్యేక బోర్డు ద్వారా కొనుగోళ్లు చేపట్టాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 8లో



వాతావరణం

జిల్లాలో ఉదయం, రాత్రి చలిగాలుల ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం మాత్రం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

వీ.వీ.పాలెంలో ఐసీఎంఆర్ - ఎన్‌సీడీ బృందం



రికార్డులు పరిశీలిస్తున్న బృందం సభ్యులు

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ఢిల్లీ నుండి వచ్చిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) ఎన్‌సీడీ బృందం సభ్యులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించాక కేంద్రం పరిధిలో బీపీ, షుగర్ బాధితులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఎన్‌సీడీ పోర్టల్‌లో చేయాల్సిన మార్పులు, చేర్పులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ బృందం రోహిత్, మాలతి తదితరులు ఉండగా హెల్త్ ఎడ్యుకేటర్ శారద, ఉద్యోగులు మౌనిక, తాల్లూరి శ్రీకాంత్, పద్మ, మేడా పుష్పావతి, పర్వీన్ పాల్గొన్నారు.

కూసుమంచి ఫైర్ ఆఫీసర్ సస్పెన్షన్

కూసుమంచి: కూసుమంచి ఫైర్ స్టేషన్ ఆఫీసర్ మోహన్‌రావును సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడి ఫైర్‌మెన్ నాగేందర్ తనపై ఫైర్ ఆఫీసర్ విధుల విషయంలో కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడడమే కాక దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదు చేశాడు. దీంతో ప్రాథమిక విచారణ అనంతరం నాగేందర్‌ను సస్పెండ్ చేశామని జిల్లా ఫైర్ ఆఫీసర్ అజయ్‌కుమార్ తెలిపారు. అయితే, పూర్తిస్థాయి విచారణ కొనసాగిస్తామని వెల్లడించారు.

మిర్చి కొనుగోళ్లు, ధరలపై ఇంటెలిజెన్స్ ఆరా

- రైతులు, మార్కెట్‌వర్గాలతో మాట్లాడిన అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం మార్కెట్‌లో మిర్చి క్రయవిక్రయాలు, ధరలపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీశాయి. రాష్ట్రంలో అత్యధికంగా మిర్చి కొనుగోళ్లు ఇక్కడే జరుగుతున్న నేపథ్యాన అధికారులు మంగళవారం మార్కెట్‌లో పరిశీలించారు. విదేశాల్లో డిమాండ్ కలిగిన 'తేజా' రకం మిర్చి క్వింటాకు గత ఏడాది ఖమ్మంలో గరిష్టంగా రూ.23వేల వరకు ధర పలకగా ఈ ఏడాది పతనమైంది. చైనాలో పంట సాగు పెరిగిందని ఎగుమతిదారులు చెబుతున్న నేపథ్యాన ప్రస్తుతం గరిష్టంగా రూ.14 వేలు, మోడల్ ధర 13,300గా నమోదవుతోంది. ఓ వైపు ధర తగ్గడం, మరోవైపు తెగుళ్లతో దిగుబడి పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు నష్టపోతున్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి బోర్డు ఏర్పాటు చేసి క్వింటాకు రూ.25 వేల ధరతో కొనుగోలు చేయాలని వామపక్షాల పార్టీల అనుబంధ రైతు సంఘాల నాయకులు మంగళవారం మార్కెట్‌లో ఆందోళన చేపట్టారు. ఈనేపథ్యాన ఇంటెలిజెన్స్ అధికారులు మార్కెట్‌లో మంగళవారం మిర్చి జెండా పాట, ధర నిర్ణయం, అందుకు ఎంచుకునే ప్రమాణాలపై ఆరా తీయడమే కాక రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత మార్కెట్ అధికారులతో మాట్లాడి ధర పతనంపై చర్చించినట్లు తెలిసింది.


పత్తి యార్డు భవనంలోకి డీఎంఓ కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి(డీఎంఓ) కార్యాలయాన్ని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పత్తి యార్డులోని ఓ భవనంలోకి మార్చారు. మార్కెట్ ప్రాంగణంలోనే ఏళ్లుగా డీఎంఓ కార్యాలయం కొనసాగుతుండగా ఆ భవనాన్ని మిర్చి యార్డు ఆధునికీకరణ పనుల్లో భాగంగా కూల్చివేశారు. దీంతో కార్యాలయ నిర్వహణకు పత్తి యార్డులో ఖాళీగా ఉన్న క్యాంటీన్ భవనాన్ని కేటాయించారు. ఇందులో మార్కెటింగ్ శాఖ అధికారితో ఇంజనీరింగ్ విభాగం కూడా కొనసాగించాల్సి ఉన్నందున మరో గదిని సైతం అప్పగించాలని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. కాగా, మిర్చి యార్డు నూతన నిర్మాణంతో పాటే జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయ భవన నిర్మాణం ఉంటుందని అధికారులు తెలిపారు.

ఎస్సారెస్పీ కాల్వ తవ్వకానికి తొలగిన అడ్డంకులు

కూసుమంచి: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 54వ ప్యాకేజీలో కాల్వ తవ్వకానికి అవసరమైన 13ఎకరాల భూసేకరణలో ఇబ్బందులతో పనులు నిలిచిపోయిన విషయం విదితమే. కాల్వ తవ్వకపోవడంతో కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లోని వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన నిర్వాసిత రైతులను ఒప్పించారు. ఈ మేరకు రూ.2.64 కోట్ల పరిహారం రైతుల ఖాతాల్లో జమ కావడంతో కాలువ్వల తవ్వకానికి అడ్డంకులు తొలగిపోయినట్లయింది. ఈ పనులు పూర్తయితే మూడు మండలాల్లో అదనంగా 11వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని అధికారులు తెలిపారు.

ముప్పై దాటితే ముప్పేనా?!



జిల్లాలో ముప్పై ఏళ్ల వయస్సు దాటిన వారిలో పలువురు రక్తపోటు, మధుమేహం సమస్య ఎదుర్కొంటున్నారు. ఈ రెండు వ్యాధులు వారిని ఆస్పత్రుల పాలు చేస్తున్నాయి. ఈనేపథ్యాన నాన్ కమ్యూనికబుల్ డిసీస్(ఎన్‌సీడీ) పేరుతో ప్రత్యేక కార్యక్రమం అమలుచేస్తూ బీపీ, షుగర్ బాధితులను గుర్తించి వైద్యంతో పాటు మందులు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో చేపట్టిన స్క్రీనింగ్‌లో 10 శాతం మంది బీపీ, 7.1 శాతం మంది షుగర్‌తో బాధపడుతున్నట్లు తేలింది. దీంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల సూచనల మేరకు వారు మందులు వాడుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకు జిల్లాలోని ఎన్‌సీడీ కార్నర్లు, క్లినిక్‌ల ద్వారా అందిస్తున్న సేవలు విస్తృతం కావడం, పెద్దసంఖ్యలో పరీక్షలు చేస్తుండడంతో బాధితుల సంఖ్య పెరుగుతుండగా, అదేస్థాయిలో చికిత్స కొనసాగుతోంది.

– ఖమ్మంవైద్యవిభాగం

ఈ వయస్సు వారిలో రక్తపోటు, మధుమేహం

- ఎన్‌సీడీ ద్వారా స్క్రీనింగ్‌తో గుర్తింపు, మందుల పంపిణీ
- రేపటి నుంచి మరో దఫా పరీక్షలకు సన్నద్ధం

జిల్లాలో ఎన్‌సీడీ లెక్కలు ఇలా..

30ఏళ్లు పైబడిన వారి జనాభా	7,30,852 (సుమారు)
బీపీ బాధితులు	73,327
షుగర్ బాధితులు	51,851
ఎన్‌సీడీ క్లినిక్‌ల ద్వారా మందులు వాడుతున్నది	64శాతం
ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నది	36శాతం

నిర్లక్ష్యంతో పెరుగుతున్న నష్టం

చాలా మంది బీపీ, షుగర్ బాధితులు తాము వాటి బారిన పడిన సంగతే గుర్తించడం లేదు. నిర్లక్ష్య ధోరణి కారణంగా రోజురోజుకూ బాధితుల సంఖ్య పెరుగుతోంది. మానసిక ఒత్తిడి, ఆహారపు అలవాట్లు, తగిన వ్యాయామం లేకపోవడం, సమయానికి తినకపోవడం వంటి కారణాలతో ఈ పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. జిల్లాలో 30ఏళ్లు పైబడిన వారి జనాభా 7,30,852 మంది ఉండగా వంద శాతం మందికి మూడు విడతల్లో పరీక్షలు నిర్వహించారు. ఈ జనాభాలో 10శాతం మంది బీపీ, 7.1శాతం మంది షుగర్‌తో బాధపడుతున్నట్లు తేలింది. వీరిలో బీపీ బాధితులు 63శాతం మంది, మధుమేహ బాధితులు 65శాతం మంది ఎన్‌సీడీ క్లినిక్‌ల ద్వారా మందులు వాడుతున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. మిగతా వారు ప్రైవేట్ ఆస్పత్రుల్లో మందులు వాడుతున్నట్లు తెలుస్తోంది.

ఎన్‌సీడీ కార్నర్, క్లినిక్‌ల్లో సేవలు

జిల్లాలో ఎన్‌సీడీ కార్యక్రమం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అమలు చేస్తున్నారు. పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఎన్‌సీడీ కార్నర్లు ఏర్పాటుచేసి ప్రత్యేకంగా స్టాఫ్‌నర్స్‌లను కేటాయించారు. అలాగే, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, మధిర, సత్తుపల్లి, పెనుబల్లి, నేలకొండపల్లి ఏరియా ఆస్పత్రుల్లోనూ ఎన్‌సీడీ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు వచ్చే బీపీ, షుగర్ బాధితులకు నెలకు సరిపడా మందులు ఒకేసారి ఇస్తున్నారు. అంతేకాక ప్రత్యేక ట్రీట్‌మెంట్ కార్డు జారీ చేసి నెలనెలా మందుల జారీ, వాడకం వివరాలు నమోదు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 35 సెంటర్లలో బీపీ, షుగర్ బాధితులకు ప్రస్తుతం సేవలందుతున్నాయి.

రేపటి నుంచి మరో దఫా

ఇప్పటికే 30ఏళ్లు దాటిన వారిలో బీపీ, మధుమేహ బాధితులను గుర్తించేలా మూడు విడతల్లో పరీక్షలు నిర్వహించారు. అయితే, బీపీ, షుగర్‌తో పాటు మూడు రకాల కేన్సర్ల గుర్తింపునకు ఇంకో విడత సర్వే చేపట్టాలని జాతీయ ఆరోగ్య మిషన్ నిర్ణయించింది. ఈ సర్వే 20వ తేదీ గురువారం నుంచి మొదలుకానుంది. మార్చి నెలాఖరు వరకు పరీక్షలు పూర్తిచేసేలా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు.

నియంత్రణే మార్గం

రక్తపోటు, మధుమేహం ఒక్కసారి సోకితే నియంత్రణ తప్ప నివారణకు అవకాశం ఉండదు. ఇలాంటి వ్యాధుల కట్టడికి కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం కింద నాన్ కమ్యూనికేబుల్ డిసీస్ కార్యక్రమాన్ని 2018 సెప్టెంబర్‌లో ప్రారంభించింది. 30 ఏళ్లు పైబడి రక్తపోటు, మధుమేహం గురయ్యే వారిని గుర్తించి ముందస్తుగా వారికి వైద్యసేవలు అందించడం.. తద్వారా వారి ఆయుష్షును పొడిగించడం ఈ పథకం లక్ష్యం. జిల్లాలో పలు విడతలుగా సర్వే నిర్వహించి బీపీ, షుగర్ బాధితులను గుర్తించగా సంబంధిత సెంటర్ల ద్వారా మందులు తీసుకుంటూ ఉపశమనం పొందుతున్నారు. అయితే, మరోమారు స్క్రీనింగ్ నిర్వహిస్తే ల్లాలో బీపీ, షుగర్ బాధితుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నా.

నాణ్యమైన వైద్యసేవలు



దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణలో భాగంగా బాధితులకు ఎన్‌డీసీ ద్వారా మెరుగైన సేవలందిస్తున్నాం. మధుమేహం, రక్తపోటు బారిన పడకుండా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, ఇప్పటికే బాధితులుగా తేలిన వారు మందులు వాడేలా పర్యవేక్షిస్తున్నాం. దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరకుండా ప్రతీఒక్కరు వ్యాయామం చేస్తూ ఆరోగ్యకరమైన, మితమైన ఆహారాన్ని తీసుకోవాలి.

– బి.కళావతిబాయి, డీఎంహెచ్‌ఓ

ఎలా 'సాగు'తున్నారు..



రైతుల సమస్యలపై చర్చిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- ఆధునిక పద్ధతులు పాటిస్తేనే లాభదాయకం
- పంటలను పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- కోతుల బెడదను ఏకరువు పెట్టిన రైతులు

కారేపల్లి: ఆధునిక పద్ధతులను పాటిస్తే ఏ పంటల్లోనైనా దిగుబడులు లాభదాయకంగా ఉంటాయని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కారేపల్లి మండలం చీమలపాడులో మంగళవారం పర్యటించిన ఆయన రైతు వెంకటేశ్వర్లు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్, శ్రీనివాసరావు సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు పలువురి పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమైన కలెక్టర్ సమస్యలపై ఆరా తీశారు. ప్రధానంగా కోతుల బెడదతో ఇబ్బంది పడుతున్నామని వాపోయిన రైతులు టపాకాయలు పేల్చినా ఫలితం ఉండడం లేదని చెప్పారు. సోలార్ ఫెన్సింగ్ అమర్చుకునేందుకు సహకరించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ అంశంపై సమీక్షించడంతో పాటు మోటార్లకు సబ్సిడీపై దశల వారీగా సోలార్ ప్యానళ్లు సమకూరుస్తామని తెలిపారు. ఆపై సాగు నీటి వనరులు, సాగు చేస్తున్న పంటలు, పెట్టుబడి, దిగుబడిపై ఆరాతీశారు. ఆయిల్‌పామ్‌తో దీర్ఘకాలిక ఆదాయం ఉన్నందున రైతులు ముందుకు రావాలని సూచించారు.

డ్రాగన్ ఫ్రూట్ అమ్మకానికి ఏర్పాట్లు

డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేస్తున్న రైతులతో మాట్లాడే క్రమాన మార్కెటింగ్ ఇబ్బందిగా ఉందని కలెక్టర్ దృష్టికి పలువురు తీసుకొచ్చారు. అయితే, కార్పొరేట్ షాపింగ్ మాళ్ల బాధ్యులతో సమావేశమై రైతుల నుంచి కొనుగోలు చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే, భూసార పరీక్షలు, సోలార్ ప్యానళ్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, అటవీ నిబంధనలకు అనుగుణంగా గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా మట్టి రోడ్డు నిర్మాణంపై అధికారులకు సూచనలు చేశారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఆత్మీయ భరోసా, సన్న ధాన్యం అమ్మిన రైతులకు బోనస్, రుణమాఫీపై భరోసా కల్పించారు. ఆతర్వాత గుడితండా వద్ద రైతు బద్దూలాల్ ఇంటిపై ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానళ్లను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా వ్యవసాయాశాఖ అధికారి డి.పుల్లయ్య, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ సురేందర్, విద్యుత్ శాఖ ఏడీ ఆనంద్, ఉద్యానవన శాఖ అధికారి వేణు, ఏఓ అశోక్‌కుమార్, ఉద్యోగులు కె.రామకృష్ణ, జార్జి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కలెక్టర్ పనితీరుపై సీఎస్ అభినందనలు

ఖమ్మం సహకారనగర్: ప్రతీ బుధవారం ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో మధ్యాహ్న భోజన నాణ్యత తనిఖీ, పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు, హాస్టళ్లలో వాటర్ ఫిల్టర్ల ఏర్పాటుతో సత్ఫలితాలు వస్తున్న నేపథ్యాన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అభినందించారు. హైదరాబాద్ నుంచి మంగళవారం సీఎస్ తాగునీరు, సాగు నీరు, విద్యుత్ సరఫరా, రైతుభరోసా, రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలనపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో మధ్యాహ్న భోజనం నాణ్యత పెంపు, కిచెన్ గార్డెన్లు, వాటర్ ఫిల్టర్ల ఏర్పాటుతో వస్తున్న ఫలితాలను కలెక్టర్ వివరించగా ఆమె ప్రశంసించారు. అనంతరం తాగు నీరు, రబీ పంటలకు సాగు నీటి సరఫరా, డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా, రేషన్ కార్డుల దరఖాస్తుల ధ్రువీకరణ, రైతు భరోసా పథకాల అమలుపై సూచనలు చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాకు ప్రస్తుతం ఇబ్బందులు లేవని, ఖమ్మం నగరంలో వరదల కారణంగా దెబ్బతిన్న పైపులైన్లను సైతం మరమ్మతు చేయించామని తెలిపారు. అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, శ్రీనివాసరెడ్డి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ సురేందర్, డీఏఓ పుల్లయ్య, డీఎస్‌ఓ చందన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

కులగణన శాస్త్రీయంగా చేపట్టాలి..

- జనాభా పెరుగుతుంటే.. బీసీలు ఎలా తగ్గుతారు?
- 317 జీఓ విషయంలో కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి
- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, పక్కన నాయకులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రభుత్వానికి చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే కమిషన్ వేసి కులగణన శాస్త్రీయంగా చేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. తమిళనాడు, బిహార్ రాష్ట్రాల్లో చట్టబద్ధమైన కమిటీ వేసి కులగణన చేపట్టారని తెలిపారు. ఖమ్మం – నల్లగొండ – వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పులి సరోత్తంరెడ్డి తరఫున మంగళవారం ఆయన ఖమ్మంలో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులి సరోత్తమ్‌రెడ్డి తమ అభ్యర్థి అని, ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఉపాధ్యాయులను కోరారు. అనంతరం ఈటల విలేకరులతో మాట్లాడుతూ.. 2011లో 3.61 కోట్లుగా ఉన్న రాష్ట్ర జనాభా.. ఇప్పుడు 4కోట్లు దాటి ఉంటుందన్నారు. ఓ పక్క జనాభా పెరుగుతుంటే బీసీల జనాభా ఎలా తగ్గుతుందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నిజాయితీ లేకపోవడంతోనే ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు.

317 జీఓకు వ్యతిరేకంగా పోరాడాం..

గతంలో కేసీఆర్ తీసుకొచ్చిన 317 జీఓతో టీచర్లు మనోవేదనకు గురయ్యారని, ఈ జీఓ తొలగిస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా మోసం చేశారని ఈటల విమర్శించారు. కానీ 317 జీఓకు వ్యతిరేకంగా బీజేపీ కొట్లాడిందన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ వద్దనుకుంటే రాష్ట్రాలు ఆప్షన్ తీసుకోవచ్చని కేంద్రం చెప్పినా కేసీఆర్ తీసేయలేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం తన విధానాన్ని ప్రకటించలేదని అన్నారు. ఇక ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్ ఉండగా, పీఆర్‌సీ అమలుకు నోచుకోలేదన్నారు. అలాగే, ఉద్యోగ విరమణ చేసిన వారికి 15 నెలలుగా బకాయిలు రాని పరిస్థితి ఉందని చెప్పారు. ఈ విషయంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండూ దగా చేశాయని విమర్శించారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్‌ను గెలిపిస్తే వారు ఒరగబెట్టింది ఏమీ లేదని, అపారమైన అనుభవం కలిగిన సరోత్తమ్‌రెడ్డిని గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి మండలిలో గళం ఎత్తుతారని ఈటల తెలిపారు. కాగా, ఆరు గ్యారంటీలు, 66 హామీల అమలుకోసం కొట్లాడుతామన్నారు. డబ్బు సంపాదించడమే లక్ష్యంగా అసైన్డ్ భూములను లాక్కోవడం, హైడ్రా, మూసీ పేరుతో కూల్చివేస్తున్నారే తప్ప హామీల అమలుపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, సుభాష్‌రెడ్డి, బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో పాటుచాడ శ్రీనివాస్, అల్లిక అంజయ్య, దొంగల సత్యనారాయణ, శ్యాంరాథోడ్, చెన్నకేశవరెడ్డి, డాక్టర్ పాపారావు, పుల్లారావు యాదవ్, మంద సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

స్తంభాద్రి గిరిప్రదక్షిణ.. వైభోగం

- దారి పొడవునా స్వామికి భక్తుల నీరాజనం
- ఆపై నక్షత్ర జ్యోతి దర్శనం





భక్తుల కోలాహలం మధ్య సాగుతున్న గిరిప్రదక్షిణ (ఇన్‌సెట్) కొండపై వెలుగుతున్న దివ్యజ్యోతి

ఖమ్మంగాంధీచౌక్: అరుణాచలం, యాదగిరిగుట్ట మాదిరిగానే ఖమ్మంకు మూలమైన త్రేతాయుగం నాటి స్వయంభూ దివ్య క్షేత్రం శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతీనెలా గిరి ప్రదక్షిణ నిర్వహించాలని నిర్ణయించగా మంగళవారం వేలాది మంది భక్తుల నడుమ నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారిని సతీసమేతంగా ఆలయం నుంచి పల్లకీపైకి చేర్చి గుట్ట కిందకు తీసుకొచ్చాక భజనలు, కోలాటాల నడుమ గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. వేలాదిగా హాజరైన భక్తులు నృసింహ నామ స్మరణకు తోడు కీర్తనలు ఆలపిస్తూ పాల్గొన్నారు. స్తంభాద్రి ఘాట్ రోడ్డు గేటు వద్ద ప్రారంభమైన ప్రదక్షిణ ఎన్నెస్పీ రోడ్, కవిత డిగ్రీ అండ్ పీజీ కళాశాల, స్తంభాద్రి మండపం, సరిత క్లినిక్, ఎల్‌ఐసీ కార్యాలయం మీదుగా తిరిగి గేట్ నుంచి ఘాట్ రోడ్ ద్వారా గుట్టపై ఆలయం వద్దకు చేరింది. ఆతర్వాత ఆలయం పక్కన కొండపై నక్షత్ర జ్యోతిని అర్చకులు వెలిగించారు. ప్రతీనెల స్వాతి నక్షత్రం రోజున సాయంత్రం గిరి ప్రదక్షిణ ఉంటుందని ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామితో పాటు భక్త మండళ్ల బాధ్యులు, అర్చకులు, స్థానికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంపీకి రాష్ట్రపతి, ప్రధాని జన్మదిన శుభాకాంక్షలు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పుట్టినరోజు బుధవారం జరగనుండగా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాజీవితంలో భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ మంగళవారం వారు వేర్వేరుగా సందేశాలు పంపారు.

సీఎం, డిప్యూటీ సీఎంను కలిసిన డీసీసీబీ చైర్మన్



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న వెంకటేశ్వరరావు

మధిర: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు హైదరాబాద్‌లో మంగళవారం కలిశారు. డీసీసీబీలు, పీఏసీఎస్‌ల పాలకవర్గాల పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈనేపథ్యాన సీఎం, డిప్యూటీ సీఎంను కలిసిన చైర్మన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



చెంచు రత్నయ్య

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బండారు చెంచురత్నయ్యకు డాక్టరేట్ లభించింది. 'ఆర్సెనిక్ ఇండ్యూస్డ్ టాక్సిసిటీ అండ్ ఇట్స్ బయోకెమికల్ ఎఫెక్ట్ ఆన్ ది సెలెక్టెడ్ టిష్యూస్ ఆఫ్ మేల్ ఆల్బినో ర్యాట్' అంశంపై ఆయన రిటైర్డ్ ప్రొఫెసర్ ఎ.ఉషారాణి పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా రత్నయ్యను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జకీరుల్లా, అధ్యాపకులు, ఉద్యోగులు ఎస్.కిశోర్, డాక్టర్ సునంద, బి.కవిత తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఉషూ పోటీలకు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఆదిలాబాద్‌లో ఈనెల 19నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి ఉషూ పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈమేరకు జిల్లా నుంచి పి.పవిత్రచారి, టి.సాయి భవ్యశ్రీ, హర్షిణి ఎంపిక కాగా, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, అసోసియేషన్ కార్యదర్శి పి.పరిపూర్ణచారి మంగళవారం అభినందించారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

చింతకాని: విద్యార్థులు ఆంగ్ల భాషపై విద్యార్థులు పట్టు సాధించాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. మండలంలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో 'వి కెన్ లెర్న్ ఇంగ్లిష్' కార్యక్రమ అమలును మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. తప్పులు వచ్చినా నిత్యం తరగతి గదిలో ఆంగ్లంలో మాట్లాడడం ద్వారా ఫలితముంటుందని చెప్పారు. అలాగే, ఉపాధ్యాయులు కూడా ఇంగ్లిష్ పాఠాలు సులువుగా అర్థమయ్యేలా బోధించాలని, విద్యార్థులు తరగతి గదిలో ఆంగ్లంలోనే మాట్లాడేలా ప్రోత్సహించాలని చెప్పారు. ఆతర్వాత పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, పరీక్షలకు సన్నద్ధతపై సమీక్షించారు. ఎంఈఓ వీరపనేని శ్రీనివాసరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం క్రాస్ వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి(42) మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. సదరు వ్యక్తి మంగళవారం రాత్రి రోడ్డు దాటుతుండగా ఖమ్మం - వరంగల్ ప్రధాన రహదారిపై వెళ్తున్న వాహనం బలంగా ఢీకొట్టింది. ఆయన కింద పడిపోయాక తల పైనుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పోలీసుల సూచనల మేరకు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.రాజు తెలిపారు.

ఆటో బోల్తా, ఇద్దరికి గాయాలు

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై మంగళవారం టాటా ఏస్ ఆటో బోల్తా పడింది. ఖమ్మం నుండి సూర్యాపేట వైపునకు అలంకరణ సామగ్రితో తీసుకెళ్తున్న ఆటో మండలంలోని హట్యాతండా సమీపాన డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఈఘటనలో డ్రైవర్, మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

అదనపు నిర్మాణాలకు అడ్డుకట్ట

- అనుమతి లేని నిర్మాణదారులకు నోటీసులు
- ఖమ్మంలో పలుచోట్ల పనుల అడ్డగింత, కూల్చివేత



బుర్హాన్‌పురంలోని ఓ అపార్ట్‌మెంట్‌పై పెంట్ హౌస్ నిర్మాణాన్ని తొలగిస్తున్న సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నానాటికీ స్థిరపడుతున్న జనాభాతో పాటే నగరం విస్తరిస్తోంది. పిల్లల చదువుతో పాటు వ్యాపారం, ఉద్యోగాలు, ఉపాధి కోసం నగరానికి వచ్చే పలువురు సొంతంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. మరికొందరు అద్దె ఇళ్లలో ఉంటుండగా డిమాండ్ పెరగడంతో యజమానులు అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలకు తెరలేపుతున్నారు. కేఎంసీ కొందరు అనుమతి తీసుకోకపోగా, ఇంకొందరు తీసుకుంటున్నా అనుమతికి మించి నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయమై అందిన ఫిర్యాదులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సీరియస్‌గా తీసుకుని అనుమతులు లేని నిర్మాణాలను అడ్డుకోవాలని కేఎంసీ అధికారులకు సూచించారు. దీంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ అధికారులు రంగంలోకి దిగారు.

పుట్టగొడుగుల్లా..

కేఎంసీలో విలీనమైన పంచాయతీలు, నగర శివారు ప్రాంతాల్లో కొత్తగా నిర్మాణాల సంఖ్య భారీగా ఉంటోంది. అలాగే, పాత భవనాలపై అదనపు నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే, ఇందులో ఎన్నింటికి అనుమతి ఉందో అధికారులకు సైతం పరిస్థితి నెలకొంది. కేఎంసీలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది తక్కువగా ఉండడం, ఉన్న వారికి అదనపు విధులు, ఎల్‌ఆర్‌ఎస్ పనులు ఉండడంతో అక్రమ నిర్మాణాలను పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఇదే అదునుగా నిర్మాణదారులు యథేచ్ఛగా నిర్మాణాలు పూర్తి చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

కూల్చివేతలే..

అనుమతుల లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని అధికారులు ఇప్పటికే పలుమార్లు హెచ్చరించారు. కొందరికి నోటీసులను కూడా చేసినా ఫలితం కానరావడం లేదు. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులు అడుగు ముందుకేశారు. ఖమ్మంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం టౌన్ ప్లానింగ్ ఏసీపీ వసుంధర నేతృత్వాన తనిఖీలు చేపట్టారు. కొన్నిచోట్ల అనుమతులు చేపడుతున్న నిర్మాణాలను అడ్డుకొని పిల్లర్లు, స్లాబ్‌లను కూల్చివేశారు. కొత్తగా నిర్మించే భవనాల పిల్లర్లను జేసీబీలతో తొలగించగా.. అపార్ట్‌మెంట్లు, ఇతర భవనాలపై నిర్మిస్తున్న పెంట్ హౌజ్‌ల గోడలను కూల్చివేశారు. అలాగే, స్లాబ్ వేసేందుకు సిద్ధంగా ఉన్న సెంట్రింగ్‌లను సైతం తొలగించారు. కాగా, కేఎంసీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు అవగాహన కల్పించారు. అలాగే, నిర్మాణ అనుమతుల పత్రాలను పనుల వద్ద ప్రదర్శించాలని సూచించారు.

ఈ మూడు వారాలే కీలకం

సాగునీటి సరఫరాలో అప్రమత్తత తప్పనిసరి

ఖమ్మంఅర్బన్: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు రానున్న మూడు వారాలు కీలకమని, ఈ సమయాన సాగర్ ప్రాజెక్టుతో పాటు ఇతర ప్రాజెక్టులు, చెరువుల పరిధి ఆయకట్టుకు సక్రమంగా నీరు సరఫరా చేయడంపై దృష్టి సారించాలని జల వనరుల శాఖ ఉన్నతాధికారులు సూచించారు. ఈమేరకు జిల్లా చీఫ్ ఇంజనీర్‌కు మంగళవారం ఆదేశాలు అందాయి. ఆయకట్టుకు నీరు అందించే విషయంలో ఇంజనీర్లు రానున్న మూడు వారాలు అప్రమత్తంగా వ్యవహరించాలని అందులో సూచించారు. ఎక్కడా నీరు వృథా కాకుండా కాల్వలపై ఈఈలు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ చేయాలని సూచించినట్లు తెలిసింది. ఇదే సమయాన వైరా రిజర్వాయర్ కింద స్థిరీకరించిన ఆయకట్టు సుమారు 17,390 ఎకరాలు ఉండగా, రబీ పంటలకు సాగర్ జలాలు అందించేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఆదేశాలు అందాయి.

డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష

మధిర నియోజకవర్గంలో జరుగుతున్న పనులపై జల వనరుల శాఖ అధికారులతో హైదరాబాద్‌లో మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్షించారు. ఖమ్మం జలవనరుల శాఖ సీఈ రమేష్, కల్లూరు ఎస్‌ఈ వాసంతితో పాటు పలువురు ఇంజనీర్లు పాల్గొనగా మండలాలు, ప్రాజెక్టుల వారీగా మంజూరైన నిధులు, ఇప్పటివరకు చేపట్టిన పనులపై సమీక్షించిన ఆయన సూచనలు చేసినట్లు తెలిసింది.

మిర్చిబోర్డు ఏర్పాటు చేయాల్సిందే...



ధర్నాలో సీపీఎం అనుబంధ సంఘం నాయకులు సుదర్శన్, తదితరులు

- సీపీఎం, సీపీఐ అనుబంధ సంఘాల ఆధ్వర్యాన ధర్నా
- క్వింటాకు రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్



మార్కెట్ చైర్మన్‌తో మాట్లాడుతున్న సీపీఐ అనుబంధ సంఘం నాయకుడు హేమంతరావు

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధర స్థిరీకరణ కోసం ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో వామపక్ష పార్టీల అనుబంధ రైతు సంఘాల ఆధ్వర్యాన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. నానాటికీ మిర్చి ధర పతనమవుతున్నందున రైతులు నష్టపోకుండా ఇతర పంటల మాదిరి మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. ఈసందర్భంగా సీపీఎం అనుబంధ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, రాష్ట్ర నాయకుడు సున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ మిర్చి ధర స్థిరీకరణకు మిర్చిబోర్డు అవశ్యమని తెలిపారు. ఈ బోర్డునుఖమ్మంలో ఏర్పాటుచేసిన క్వింటాకు రూ.25 వేలు చెల్లించేలా మార్క్‌ఫెడ్, నాఫెడ్‌ల ద్వారా కొనుగోళ్లు చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు, జిల్లాలో ముగ్గురు రాష్ట్రమంత్రులు ఉన్నందున ఈ విషయంలో స్పందించాలన్నారు. అలాగే, సీపీఐ అనుబంధ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యాన కూడా నిరసన తెలపగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు మాట్లాడారు. మిర్చి ధర పతనానికి పాలకులే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. మిర్చిబోర్డు ఏర్పాటుతోనే రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈవిషయంలో స్పందించకపోతే మార్కెట్లో లావాదేవీలను స్తంభింపచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం, సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు యర్రా శ్రీకాంత్, మాదినేని రమేష్, భూక్యా వీరభద్రం, వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, యల్లంపల్లి వెంకట్రావు, తాతా భాస్కర్‌రావు, కొక్కెర పుల్లయ్య, దండి సురేష్, మహ్మద్ మౌలానా, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, యర్రా బాబు, శింగుసర్సింహారావు, పోటు కళావతి, మిడికంటి చిన్న వెంకటరెడ్డితో పాటు మిర్చి తీసుకొస్తున్న రైతులు కూడా పాల్గొన్నారు. కాగా, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు వారితో చర్చించి త్వరలోనే అధికారులు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పీహెచ్‌సీలో కేంద్ర బృందం తనిఖీ



పీహెచ్‌సీలో వివరాలు ఆరా తీస్తున్న సభ్యులు

ముదిగొండ: ముదిగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని వైద్య ఆరోగ్య అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ కె.శశిశ్రీతో పాటు కేంద్రప్రభుత్వ టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించాక మందుల నిల్వలు, టీకాలపై ఆరాతీశారు. ఆరోగ్యకేంద్రంలోని ఫార్మసీకి సరఫరా అయిన మందులు, పంపిణీపై వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆతర్వాత వైద్య సేవపై ఉద్యోగులకు సూచనలు చేశారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌కుమార్, కుత్బుల్లాపూర్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, డీపీఓ దుర్గ, వైద్యాధికారి డాక్టర్ అరుణాదేవి, ఉద్యోగులు మోహన్, ఖాదర్‌బీ, సత్యవతి, రాణి పాల్గొన్నారు.

ముదిగొండ, తల్లాడ జట్ల గెలుపు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ టోర్నీలో మంగళవారం ముదిగొండ, తల్లాడ జట్లు విజయం సాధించాయి. ముదిగొండ – ఏన్కూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముదిగొండ 15 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసింది. ఈ జట్టులో పవన్ 43 బంతులు ఆడి ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 68 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఏన్కూరు జట్టు విజయానికి సరిపడా పరుగులు చేయకపోవడంతో ముదిగొండ జట్టు గెలుపొందింది. అనంతరం తల్లాడ - జూలూరుపాడు మధ్య మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన తల్లాడ జట్టు 16ఓవర్లలో 121 పరుగులు చేసింది. ఆపై జూలూరుపాడు జట్టు 16ఓవర్లలో 100పరుగులే చేయడంతో ఓటమి పాలైంది. మ్యాచ్‌లను కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంబూరు దయాకర్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.క్రిస్టోఫర్‌బాబు, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.డీ.మతిన్, కోచ్ ఎం.డీ.గౌస్ ప్రారంభించారు.

అర్హత లేదు.. అనుమతులూ లేవు

ఆక్యూ పంక్చర్ ఆస్పత్రి సీజ్



ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

ఖమ్మంవైద్యవిభాగం: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఆక్యూ పంక్చర్ ఆస్పత్రిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయి సీజ్ చేశారు. ఖమ్మం కమాన్‌బజార్‌లోని పెయిన్ రిలీఫ్ ఆక్యూ పంక్చర్ ఆస్పత్రిని డీఎంహెచ్‌ఓ మంగళవారం తనిఖీ చేశారు. ఆ సమయంలో డాక్టర్‌గా వ్యవహరిస్తున్న పి.విజయభాస్కర్ లేకపోగా, ఆయనకు అర్హత లేదని, రిజిస్ట్రేషన్ లేకుండానే ఆస్పత్రి నడుపుతున్నట్లు తేలడంతో సీజ్ చేయించారు. తగిన అర్హతలు లేకుండా వైద్యం చేయడం నేరమని, ఒకవేళ అర్హత ఉన్నా ఆలోపతిక్ చట్టప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకున్నాక ప్రాక్టీస్ చేయాలని ఆమె స్పష్టం చేశారు. తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు, సీహెచ్‌ఐ పీఓ చందునాయక్, డెమో సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

జేవీఆర్ సీహెచ్‌పీని పరిశీలించిన డైరెక్టర్



సీహెచ్‌పీలో పరిశీలిస్తున్న డైరెక్టర్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సత్తుపల్లిలోని జేవీఆర్ సీహెచ్‌పీని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) పీపీ) కె.వెంకటేశ్వర్లు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బొగ్గు రవాణా, కోల్ రిసీవింగ్ కాంప్లెక్స్ వద్ద అన్‌లోడింగ్ సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఆ తర్వాత కోల్ ఏరియా, డిశ్చార్జి పాయింట్‌ను కూడా పరిశీలించారు. సీహెచ్‌పీ నుంచి దుమ్ము వెలువడకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఏరియా జీఎం శాలేంరాజుతో చర్చించారు. కార్యక్రమంలో అధికారులు సూర్యనారాయణ, కోటిరెడ్డి, రామకృష్ణ, ఆర్.ప్రహ్లాద్, నర్సింహారావు, కె.సోమశేఖర్ పాల్గొన్నారు.

ఏసీబీ వలలో అటవీ అధికారులు

ఇల్లెందురూరల్ : అటవీ భూముల నుంచి మట్టి తరలించేందుకు రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఎఫ్ఆర్‌ఓ, ఎఫ్‌బీఓ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ ఘటన ఇల్లెందు మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలతో పలు గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారడంతో మండలంలోని బోడుతండా, కొమరారం, పోచారం తండా గ్రామాల రైతులు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ద్వారా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీంతో కలెక్టర్ ఫ్లడ్ రిలీఫ్ ఫండ్ నుంచి ఒక్కో గ్రామానికి రూ.1.50 లక్షల చొప్పున విడుదల చేశారు. పొలాలకు వెళ్లే రహదారులపై గ్రావెల్ పోసుకోవాలని సూచించారు. దీంతో బోడుతండాకు చెందిన ఓ రైతు ఈ ఏడాది సంక్రాంతి రోజున మట్టి కోసం అటవీ ప్రాంతానికి వెళ్లాడు. విషయం తెలుసుకున్న కొమురారం ఎఫ్ఆర్‌ఓ ఉదయ్‌కిరణ్, ఎఫ్‌బీఓ హరిలాల్ మట్టి తరలింపును అడ్డుకుని జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. దీంతో రైతు రూ.15వేలు ముట్టజెప్పి జేసీబీని విడిపించుకున్నాడు. ఆపై మొరం తోలకానికి అనుమతి ఇవ్వాలని అటవీ అధికారులను వేడుకోగా రూ.50 వేలు లంచం డిమాండ్ చేశారు. చివరకు బతిమిలాడి రూ.20 వేలు చెల్లించి పనులు ప్రారంభించాడు. అయితే పొలాలకు నీరు పెడుతుండడంతో ఆ దారిలో ట్రాక్టర్ వెళ్లేందుకు వీల్లేక కొన్ని రోజులు పనులు నిలిపివేసి, వారం క్రితం మట్టి తోలుకుంటున్నట్లు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. మిగిలిన రూ.30 వేలు ఇస్తేనే మట్టి తీసుకెళ్లాలని వారు ఖరాఖండిగా చెప్పడంతో రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు మంగళవారం రూ.30 వేలు తీసుకుని అటవీ రేంజ్ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ ఎఫ్ఆర్‌ఓ సూచనతో ఎఫ్‌బీఓకు నగదు ఇస్తుండగా మాటువేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

కంటి పరీక్షల శిబిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌ఓ



విద్యార్థినికి కంటి పరీక్షలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.కళావతిబాయి మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా పలువురికి స్వయంగా పరీక్షలు చేసిన ఆమె వైద్యులతో సమీక్షించారు. కంటి సమస్యలు ఉన్న వారికి రెండో విడత పరీక్షల అనంతరం అవసరమైన విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఎవరికైనా ఆపరేషన్ అవసరమైతే హైదరాబాద్ పంపిస్తామని చెప్పారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చందునాయక్, డెమో సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

కబడ్డీ ఎంపిక పోటీలకు 195మంది హాజరు



ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలబాలికల జట్ల ఎంపికకు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన పోటీలకు మంచి స్పందన లభించింది. కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పోటీలకు బాలురు 120 మంది, బాలికలు 75 మంది హాజరయ్యారు. వీరిని జట్లుగా విభజించి పోటీలు నిర్వహించగా, ప్రతిభ కనబర్చిన వారితో జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి టి.దయాకర్‌రెడ్డి, కె.క్రిస్టోఫర్‌బాబు, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డితో పాటు సుధాకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

26నుంచి రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు

చింతకాని: మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 26నుంచి మండలంలోని నేరడలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయని నేతాజీ యువజన సంఘం కార్యదర్శి దూసరి గోపాలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జట్ల బాధ్యులు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి ఈనెల 25వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచేవారికి వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30వేలతో పాటు ఎనిమిదో స్థానం వరకు నిలిచే జట్లకు సైతం నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. వివరాలకు క్రీడాకారులు 70939 00119, 93945 71739, 80084 92173 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య



రాధాకృష్ణ (ఫైల్)

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం గంగారం పంచాయతీ జలగంనగర్‌కు చెందిన కంచి రాధాకృష్ణ(30) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గంగారంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకున్నాడు. ఈమేరకు సత్తుపల్లి పోలీసులు వివరాలు సేకరించారు. అయితే, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియకపోగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు. కాగా, రాధాకృష్ణకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

ఆరుగురు వాహన యజమానులపై కేసు

చింతకాని: సరుకు రవాణాకు వినియోగించే బోలెరో వాహనాల్లో ప్రయాణికులను తీసుకెళ్తున్న ఆరు వాహనాల యజమానులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. బోనకల్ నుంచి బోలెరో వాహనాల్లో కూలీలను ఎక్కించుకుని నాగులవంచ వైపు వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా జరిగే ప్రమాదాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించి, వాహన యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యోగి నుంచి డబ్బు వసూలుకు పన్నాగం

- మహిళలను వేధించిన కేసు నమోదైందని బెదిరింపులు

ఖమ్మంఅర్బన్: సైబర్ మోసాలు రోజురోజుకు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. అలాంటి ఘటనే సోమవారం వెలుగుచూసింది. ఖమ్మం మమత రోడ్డులో నివాసముండే ఓ వ్యక్తి ఖమ్మం రూరల్ మండలంలోని పంచాయతీరాజ్‌శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు సోమవారం గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్ రాగా హిందీ, ఇంగ్లిషు భాషల్లో మాట్లాడిన అవతలి వ్యక్తి బెంగళూరు పోలీసుగా చెప్పుకున్నాడు. సదరు ఉద్యోగి ఫోన్ నుంచి మహిళలకు ఫోన్ చేస్తూ వేధిస్తున్నారని, ఈ విషయమై అందిన ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదైందని చెబుతూ, సెటిల్‌మెంట్ కోసం డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో కంగారు పడిన సదరు ఉద్యోగి తన మిత్రుడు పోలీసు శాఖలో ఉండడంతో సమాచారం ఇచ్చాడు. అయితే, ఇది సైబర్ నేరగాళ్ల పనేనని పోలీసు ఉద్యోగి చెప్పడంతో తనకు వచ్చిన ఫోన్ నంబర్ వివరాలతో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చెల్లని చెక్కు కేసులో జైలుశిక్ష, జరిమానా

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో ఖమ్మం బుర్హాన్‌పురకు చెందిన బ్రహ్మదేవర సోమయ్యకు ఏడాది జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ ఖమ్మం ఆబ్కారీ కోర్టు న్యాయమూర్తి రాళ్లబండి శాంతిలత మంగళవారం తీర్పు చెప్పారు. ఖమ్మం కుమ్మరి బజార్‌కు చెందిన తవిడిశెట్టి యుగంధర్ వద్ద సోమయ్య 2015 ఫిబ్రవరి 15న రూ.10 లక్షల అప్పు తీసుకున్నాడు. ఈ అప్పు చెల్లించే క్రమాన 2017 ఫిబ్రవరి 14న రూ.14.80లక్షలకు చెక్కు జారీ చేశాడు. అయితే, ఆ చెక్కును బ్యాంకు ఖాతాలో జమ చేసేందుకు వెళ్లగా అప్పటికే సోమయ్య ఖాతా మూసివేశాడని తెలియడంతో కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. ఈ కేసు విచారణలో ఆయనపై నేరం రుజువు కాగా ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పట్టపగలే చోరీకి యత్నం, బంధించిన స్థానికులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం రోటరీనగర్‌లో ఓ ఇంటి తాళాన్ని రోకలిబండతో పగులగొట్టేందుకు ప్రయత్నించిన వ్యక్తిని స్థానికులు పోలీసులకు పట్టించారు. మంగళవారం మధ్యాహ్నం సాగర్ ప్రధాన కాల్వ సమీపాన ఒక ఇంటికి తాళం వేసి ఉండగా గుర్తుతెలియని రోకలిబండతో పగులగొట్టేందుకు యత్నిస్తున్నాడు. ఈక్రమంలో శబ్దం విన్న స్థానికులు ఆయనను పట్టుకొని ఖమ్మం అర్బన్ పోలీసులకు అప్పగించారు. కాగా, చోరీకి యత్నించిన వ్యక్తి పాత నేరస్తుడని, గతంలో కొణిజర్ల స్టేషన్‌లో నమోదైన కేసులో వారెంట్ జారీ అయిందని పోలీసులు తెలిపారు. దీంతో నిందితుడిని కొణిజర్ల పోలీసులకు అప్పగించినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.